# కిటికీ రెక్కలు

"ఇంకోసారి ఆ కిటీకీ తలుపు తీశావా....ఊరుకొనేది లేదు" అరిచాడు సిద్దప్ప.

"అలా అంటే ఎలాగండి? గాలి వెలుతురు లేక చస్తున్నాను." చెప్పింది అక్షర.

"గాలి వెలుతురు కోసమా లేక ఎదురింటాయన కోసమా?" వెటకారంగా అడిగాడు సిద్దప్ప.

"ఛ....ఛ.... ఆయన వయసేంటి? నా వయసేంటి?" చెప్పింది అక్షర.

"ఓహ్ సరయిన వయసు వారయితే ఓ. కే నన్న మాట నీ బుద్దే బుద్ధి అని నాకెప్పుడో తెలుసు." అరిచాడు సిద్దప్ప.

"తెలిసి ఎందుకు చేసుకొన్నారు?" అడిగింది కోపంగా.

"అయితే నీది పాడుబుద్దని వప్పుకుంటున్నావన్నమాట!"

విసురుగా బయటికి వెళ్ళిపోయాడు సిద్దప్ప.

అక్షర కళ్ళల్లో నీరు తిరిగింది. కానీ కన్నీరు బయటకు రాకుండా అణుచుకుంది ఛ! ఎలాంటి అనుమానస్థుణ్ని పెళ్ళి చేసుకుంది? తన పెళ్ళయిన ఈ నాలుగు నెలల్లో ఒక్క రోజుకూడా సుఖపడలేదు. తనేమంత అందగత్తె కూడా కాదు. అనుమానించడానికి కారణం లేని అనుమానం అతనిది. అదో మానసిక జాఢ్యం అయివుండాలి. అకస్మాత్తుగా ఆఫీసు నుంచి మధ్యలో ఇంటికి వచ్చి, ఓ అయిదు నిమిషాలుండి వెళ్తాడు.

కొత్తలో అది ప్రేమ అనుకొంది తను కానీ అది అనుమానం అని తెలుసుకోడానికి కొంత టైం పట్టింది.

ట్రాన్సిస్టర్ని ఆన్ చేసింది. విశాఖపట్నం కేంద్రంనించి మహిళా కార్యక్రమం వస్తోంది. అది వింటూ తన మనస్సుని ఆలోచనారహితంగా చేసుకొనడానికి ప్రయత్నించి కొంతదాకా విజయం పొందింది.

ముప్పావు గంట తర్వాత సిద్దప్ప ఓ కొత్త వ్యక్తితో వచ్చాడు. అక్షర చూస్తుండగానే ఆ వ్యక్తి కిటికీ తెరిచే అవకాశం లేకుండా రెండు రెక్కల్ని కలిపి, ఓ మారు జాతి చెక్కని మరమేకులు దింపి బిగించాడు ఆ వడ్రంగి వెళ్తూ వెళ్తూ తనవంక చూసి నవ్విన నవ్వు అక్షర గుండెల్లో గునపంలా గుచ్చింది. తను నిజంగా తిరుగుబోతు అన్నట్లుగా చూసాడు. అలాగని చెప్పి అతన్ని తీసుకొని వచ్చి వుంటాడు తన భర్త.

ఆ క్షణంలో అక్షర మనసులో ఆలోచనలకు కొత్తరెక్కలొచ్చాయి. సిద్దప్ప, అతనూ వెళ్ళిపోయినా లేచి వెళ్ళి ఎప్పటిలా తలుపు మూయలేదు. అలాగే కూర్చుని ఆలోచించసాగింది.

జీవితాంతం ఈ అనుమాన పిశాచితో తను వేగలేదు. అలాగని విడిపోలేదు. విడిపోయి పుట్టింటికి భారంగా వెళ్ళలేదు. తన ఇంటర్ అర్హత తనని తను పోషించుకొనే ఉద్యోగాన్ని సంపాదించలేదు. ఇక చావే శరణ్యం.

చావు!

వెంటనే ఆమెకి భజరంగ్ గుర్తొచ్చాడు. తనని ఎంతగా ఆరాధించాడు? ఎంతగా ప్రేమించాడు. సిద్దప్పతో తన పెళ్ళి నిశ్చయం అయిందని తెలిసాక ఎంత విలవిల్లాడిపోయాడు. సాంప్రదాయం నమ్మి అతనితో లేచి వెళ్ళే ధైర్యం చేయలేకపోయింది. తన వివాహం అయిన రెండు నెలల తర్వాత కూడా ఉత్తరం రాశాడు. దాన్ని చదివి చింపేసి ఇంకెన్నడూ తనకి లెటర్సు రాయవద్దని సమాధానం రాసి పడేసింది.

చేజేతులా బంగారు జీవితాన్ని నాశనం చేసుకొన్నానని అక్షర పశ్చాత్తాపపడింది.

ఆ రోజునుంచి ఆమె ఎంతో మూకీగా వుండసాగింది. అవసరం వచ్చినా నిశ్శబ్దంగా వుంటుంది తప్ప మాట్లాడదు. ఇరుగూ పొరుగూ ఆమె లోని ఈ మార్పుని గుర్తించి ఎందుకలా వున్నావని ప్రశ్నించసాగారు.

"ఈయనతో కాపరం చేసేకంటే చావడం మేలు" అని ఏడిచేది.

కిటికీ తెరవకుండా చెక్క అడ్డుకొట్టిన ఇరవై ఆరోరోజు, ఆమె ఆలోచనలకు రెక్కలొచ్చిన ఇరవై ఆరోరోజు జరిగిందిది. సిద్దప్ప నిద్రలేచి చూస్తే ఆమె లేదు. అక్షర పెట్టి వెళ్ళిన ఉత్తరం వుంది.

నా ఆత్మహత్యకు బాధ్యత ఎవరిదీ కాదు. నాలోని డిప్రెషన్‌ని భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నాను. నాలాంటి దానికి ఇలాంటి ఆత్మహత్య సబబని మాత్రం చెప్పను. తప్పని పరిస్థితుల్లోనే ఇలా ఏమనిషయినా ఆత్మహత్యకి ప్రలోభపడేది. నా విషయంలోనూ అదితప్పడం లేదు.

పోలీసులకు రిపోర్టు ఇచ్చాడు సిద్దప్ప.

* * *

దూరంగా రైలు.... సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అతివేగంగా దూసుకు వస్తోంది. సౌత్ ఇండియా నుంచి నార్త్ ఇండియాకు వెళ్తుంది అది.

"ఎవరికీ ఎలాంటి అనుమానం కలుగదు కదా ?" అడిగాడు భజరంగ్.

"ఉహూ నా శవంకోసం పోలీసులు సముద్రతీరం అంతా గాలించిన శవం కనపడలేదని కేసు మూసేస్తారు. నేను నీతో లేచి రావడంవల్ల నా కుటుంబ గౌరవం కూడా తగ్గదు చెప్పింది అక్షర.

"నిజమే దీనికన్నా ఆత్మహత్యే గౌరవప్రదం అనుకొనే సమాజం మనది. చెప్పాడు భజరంగ్.

ఆ తర్వాత భజరంగ్, అక్షర ఒకరి చేతులు మరొకరు పట్టుకొని మౌనంగా వుండిపోయారు.

తెలుగు వాళ్ళకి దూరంగా గుజరాత్‌లో తామిద్దరూ కలసి గడప బోయే నూతన జీవితం మీద ఆ ఇద్దరికీ కొండంత ఆశ వుంది.

(స్వీట్ సిక్స్‌టీన్-1990)